# అభిమాని

గాలికి కిటికీ రెక్కలు టపటపా కొట్టుకున్నాయి పెద్ద శబ్దంతో ఉన్నట్టుండి హఠాత్తుగా పెద్ద పెద్ద చినుకులతో వర్షం ప్రారంభమైంది.

శ్రావ్య చదువుతోన్న పుస్తకం తీసి పక్కనపెట్టి దివాన్‌మీంచి లేచింది. కిటికీలోంచి వీస్తోన్న గాలికి టేబిల్‌మీద పెట్టిన రెండు న్యూస్ పేపర్లు చెల్లాచెదురై కిందపడ్డాయి.

శ్రావ్య చప్పున వెళ్ళి కిటికీ తలుపులు మూయబోతోంటే జల్లు విసురుగా మొహానికేసి కొట్టింది. కళ్ళమీద పడ్డ జల్లులు తుడుచుకుంటూ బైటికి చూసింది. కిటికీలోంచి వాన ఉధృతంగా కురుస్తోంది. రోడ్డుకి ఎదురుగా ఉన్న బస్టాప్‌లో కొంతమంది నిలబడి ఉన్నారు. ఆడవాళ్ళు ఓ ఐదారుగురు షెల్టర్ కింద నిల్చున్నారు. మగవాళ్ళు ఓ పదిమంది వానకి తడుస్తూ పక్కనే ఉన్న చెట్టుకింద నిల్చున్నారు.

'క్షణంలో ఎంత వాన!' శ్రావ్యకి ఆశ్చర్యం వేసింది. మళ్ళీ జల్లు విసురుగా తాకింది మొహాన్ని. మొరాయిస్తోన్న కిటికీ రెక్కలు బలవంతంగా పట్టుకుని మూయబోతోంటే కుదరలేదు. విసురుగా వీచిన గాలికి కిటికీ రెక్క వెనక్కి వచ్చేసింది. మొహం చిట్లించి రెండు చేతుల్తో బలవంతంగా మూయబోతుండగా ఆమె దృష్టిని ఆకర్షించాడతను.

తెల్లని పైజామా, లాల్చీ... సన్నని ఫ్రేమున్న కళ్ళజోడు, తెల్లగా, సన్నగా, పొడుగ్గా ఉన్నాడు. చూడగానే ఎంతో బుద్ధిమంతుడు, సంస్కారి అన్న అభిప్రాయం కలిగించేలా ఉన్న అతన్ని చూడగానే శ్రావ్యకి అతను చాలా చిరపరిచితుడులా అన్పించాడు. అతని భుజాన సంచి ఒకటి వ్రేళ్లాడుతోంది. చెట్టు కింద చలికి ఒదిగి నిలబడి ఉన్నాడు.

శ్రావ్య అలా చూస్తుండగానే బస్సేదో వచ్చేసింది. ఒకళ్ళనొకళ్ళు

తోసుకుంటూ ఎక్కేస్తోన్న జనంలో అతను కనుమరుగయ్యాడు.

అప్పుడే అదే బస్సులోనుంచి దిగిన వినిత తలమీదకు చెంగు లాక్కుని పరిగెత్తుకుంటూ తన ఫ్లాట్ వైపు వెళ్లిపోయింది. ఆమె బాంక్ ఎంప్లాయీ.. శ్రావ్య కిటికీ బలవంతంగా మూసేసి బోల్టు పెట్టేసింది. 'హమ్మయ్య' అనుకుంటూ వెనక్కి తిరిగి దివాన్ వైపు నడిచింది.

మడిచి పెట్టిన పుస్తకం చేతిలోకి తీసుకుని దివాన్ మీద వాలిపోయింది. టేప్‌రికార్డర్‌లోంచి పాత హిందీ సినిమా పాట వినిపిస్తోంది... ' ఆయేగా ఆయేగా ఆయేగా... ఆనే వాలా...'' లత స్వరం తీయగా ఉంది.

నితిన్ ఆఫీసుకి వెళ్లగానే చిన్న చిన్న పనులు పూర్తిచేసుకుని నవల చదువుకుంటూ స్టీరియోలో పాటలు వింటూ గడిపేస్తుంది శ్రావ్య... మధ్య మధ్యలో ఫోనులో నితిన్‌తో మాట్లాడుతూ... అల్లరి చేస్తూ. అడపాతడపా పక్క ఫ్లాట్‌లో వున్న నివేదిత వచ్చి కబుర్లు చెప్తుంటుంది. ఆమె కూడా శ్రావ్యలాగే సాహిత్యాభిమాని. వాళ్ళిద్దరూ ప్రఖ్యాత రచయితగా ఆంధ్ర పాఠకలోకాన్ని ఉర్రూతలూగిస్తోన్న సూర్యమిత్ర అభిమానులు. ఆయన నవలల మీద వాళ్లిద్దరికీ చాలా చర్చ జరుగుతూంటుంది. ప్రస్తుతం... శ్రావ్య చేతిలో అతను రాసిన నవల 'కాంతి కిరణం' ఉంది. నవలలో హీరోయిన్ పెళ్లైన యువతి. అనుకోని పరిస్థితుల్లో ప్రేమించిన వాడ్ని కాక తండ్రి నిర్ణయించిన వరుడితో ఆమె వివాహం జరుగుతుంది. అన్నీ మరచి అతనితో అడ్జస్ట్ అయిపోయి బతికే సమయంలో ప్రేమించిన యువకుడు ఆమె జీవితంలోకి పునః ప్రవేశం చేసి ఆమె మనసులో అలజడి రేకెత్తిస్తాడు. అంతవరకూ చదివింది శ్రావ్య... కథ మంచి రసకందాయంలో పడింది... ముగింపు గురించిన ఆతృత... కుతూహలం విపరీతంగా ఉంది.

సూర్యమిత్ర మంచి రచయిత.

స్త్రీలోని ప్రేమించే హృదయాన్ని ఓ బలహీనతగా భావించి ఆ బలహీనతని మగవాడు ఎంత చక్కగా, ఆర్టిస్టిక్‌గా, చాకచక్యంగా క్యాష్ చేసుకుంటాడో అనేక రకాలుగా విశదీకరించి... ఆ మగవాడ్ని జయించి తనను తాను ఎలా రక్షించుకోవాలో సందేశాన్నిస్తుంటాడు తన ప్రతి రచనలో

అతని రచనల్లోని ఇతివృత్తం, శైలి, శిల్పం, భావప్రకటన, పాత్రల సృష్టి, సున్నితమైన హాస్యం, అలవోకగా వయ్యారంగా హృదయాలను తగిలీ

తగలకుండా తాకి స్పందింపచేసే శృంగారం శ్రావ్యకి ఎంతో ఇష్టం.

కాలింగ్ బజర్ మ్రోగటంతో శ్రావ్య లేచి తలుపు తీసింది. పక్క ఫ్లాట్‌లోని వాళ్ల పాప రజిత నిలబడి ఉంది. వర్షం ఇంకా ఉధృతంగా కురుస్తూనే ఉంది.

''ఆంటీ! మమ్మీకి పుస్తకం కావాలిట'' అడిగింది పాప. శ్రావ్య లోపలికి వెళ్లి రాక్‌లోంచి ఓ నవల తీసి రజితకిచ్చింది.

''థాంక్యూ ఆంటీ'' తుర్రుమంది రజిత.

శ్రావ్య ఓసారి బైటికి వచ్చి రోడ్డు వైపు దృష్టి సారించింది. నడుములోతు నీళ్లొచ్చేసాయి. వాహనాలు రోడ్డు పక్కన ఆపుకుని అక్కడక్కడా ఉన్న షాపుల దగ్గరా, ఇళ్ల దగ్గరా జనం నిలబడి ఉన్నారు.

వర్షం జల్లు మీద పడుతూండటంతో వెనక్కి తిరిగి లోపలికి రాబోయిన శ్రావ్య ఆగిపోయింది.

తన ఇంటిముందు కిటికీకి దగ్గరగా అరుగుమీద ముడుచుకుని నిల్చున్నాడు లాల్చీ, పైజామా వ్యక్తి... తనింతకుముందు బస్టాపులో చూసిన బుద్ధిమంతుడు.

అతణ్ణి అలా చూస్తోంటే జాలేసింది. ఆమెని చూసి మొహమాటంగా మొహం తిప్పేసుకున్నాడతను. చేతిలో ఉన్న సంచి తడవకుండా జాగ్రత్తగా పొదివిపట్టుకున్నాడు.

''లోపలికి రండి... ఫర్వాలేదు...'' మృదువుగా అంది శ్రావ్య.

''ఫర్వాలేదండీ... థాంక్యూ... మీరేమీ అనుకోకపోతే ఈ సంచి లోపల పెట్టండి. వాన తగ్గాక తీసుకుంటాను. ఇందులో బుక్స్ ఉన్నాయి. తడిసిపోతాయి'' అన్నాడు.

శ్రావ్యకి 'పాపం...!' అనిపించింది.

''ఫర్వాలేదు... మీరుకూడా రండి... కూర్చోండి... వాన వెలిశాక వెళ్లచ్చు''

''తగ్గిపోతుందండీ...'' పల్చగా నవ్వాడు. శ్రావ్య తనూ నవ్వుతూ అంది...

''తగ్గుతుంది... తగ్గాక వెళ్ళిపోదురుగాని... ఫర్వాలేదు రండి. బాగా తడిసిపోయారు'' మరోసారి ఆమె చెప్పడంతో తల వంచుకుని గుమ్మంలో చెప్పులు వదిలి లోపలికొచ్చాడు.

తలుపు ఓరగా వేసింది శ్రావ్య. కుర్చీ ఒకటి తలుపు దగ్గరికి జరిపి ''కూర్చోండి'' అంది.

''థాంక్యూ!'' అతను కళ్లద్దాలు తీసి కూర్చుంటూ, లాల్చీతో అద్దాలు తుడువసాగాడు.

శ్రావ్య చేతిలో వున్న నవల టేబుల్‌మీద పెట్టి లోపలికెళ్లి, స్టాండ్‌మీద ఉన్న టవల్ తీసుకొచ్చి అతనికిచ్చి, ''తల తుడుచుకోండి'' అంది.

''థాంక్యూ'' అతను అది అందుకున్నాడు.

నవ్వింది శ్రావ్య. ''వర్షం తగ్గి వెళ్లేటప్పుడు అన్ని థాంక్స్‌లు చెప్పచ్చు ఒకేసారి... ప్రస్తుతం మాటిమాటికీ థాంక్స్ అనకండి'' అన్నది.

శ్రావ్య నవ్వుతో శృతి కలుపుతూ. ''అలవాటైపోయింది'' అన్నాడు.

''పాశ్చాత్య సంస్కృతికి మనం చాలా త్వరగా అలవాటు పడతాంలెండి''

శ్రావ్య చొరవ, చలాకీతనం చూస్తోంటే అతనికి ముచ్చటగా అనిపించింది. కొత్తా, పాతా, ఆడ, మగా తేడాలేం లేనట్టున్నాయి ఈ అమ్మాయికి అనుకున్నాడు.

టవల్‌తో తల తుడుచుకుంటోన్న అతని దృష్టి హఠాత్తుగా టేబుల్‌మీద ఉన్న పుస్తకంవైపు వెళ్లింది.

''మీరు సాహిత్యాభిమానా?'' అన్నాడు ఆమెవైపు చూస్తూ.

''అవునండీ... నేను సూర్యమిత్రగారి అభిమానిని'' ఆ పుస్తకం ఆప్యాయంగా చేతిలోకి తీసుకుంటూ అంది.

''కారణం తెలుసుకోవచ్చా?'' కుతూహలంగా అడిగాడు.

''సూర్యమిత్రగారికి స్త్రీలంటే చాలా అభిమానం, గౌరవం... ఆయన సృష్టించిన ప్రతి స్త్రీ ప్రాతలోనూ ఏదో ఒక గొప్పతనం ఉంటుంది - పోనీ ఊహాసుందరులా అంటే అదీ కాదు - నిత్యం మన జీవితంలో అనేక సందర్భాల్లో తారసపడే ఎన్నో రకాల మనస్తత్వాలు ఆయన పాత్రల్లో ఉంటాయి: అందరినీ తన మనో చక్షువులతో చూసి అర్థంచేసుకుంటారాయన. స్త్రీలు దుష్టశక్తులనుంచి ఎలా తప్పించుకోవాలో ఎన్నో రకాల మార్గాలను బోధిస్తారు. ఆయన చెప్పదలుచుకున్న విషయాన్ని ఓ ఉపన్యాసంలా, ఓ పాఠంలా కాకుండా ఎంతో రసవత్తరంగా చెప్తారు... అందుకే నాకాయన రచనలంటే అంత ప్రాణం''

నవ్వాడు అతను. ''ఏమేం బుక్స్ చదివారు?'' అడిగారు సంచీలోంచి

పుస్తకాలు తీసి తుడిచి, కిందపెడుతూ.

''ఆల్మోస్ట్ అన్నీ చదివాను. ఆమధ్య ఆయనేదో డైరెక్ట్ నవల రిలీజ్ చేశార్ట అదే కాపీ దొరకలేదు. ఆయన పుస్తకాలలా హాట్ కేక్స్‌లా అమ్ముడవుతాయి. రియల్లీ హి ఈజ్ గ్రేట్' టీపాయ్ అతనికి సమీపంగా జరుపుతూ, ''దీనిమీద పెట్టుకోండి బుక్స్'' అన్నది.

అతను వంగి పుస్తకాలు తీసి టీపాయ్ మీద పెట్టాడు. అటువైపు దృష్టి సారించిన శ్రావ్య ఆశ్చర్యంగా అన్నది.

''అరే! మీదగ్గర కూడా ఆయన బుక్సే వున్నట్టున్నాయే? మీరూ ఆయన అభిమానా?''

అతను మాట్లాడలేదు. సంచీలోంచి మరో పుస్తకం తీసి శ్రావ్యకి చూపిస్తూ అన్నాడు, ''మీరు వెదుకుతోన్న బుక్ ఇదేనా?''

''అరే ఇదే... చాలా బుక్స్ కొన్నారే. మీకు లైబ్రరీ వుందా?''

''ఈ బుక్స్ నా ఫ్రెండ్.ఒకతను తీసుకున్నాడు. ఇంతకుముందే రోడ్డుమీద కనిపించాడు. నాకు రిటర్న్ చేయడానికి బయల్దేరాట్ట... దారిలో ఎదురయ్యానుకదా! నాకిచ్చేశాడు. ఈ బుక్స్ తడవకుండా నానా అవస్థ పడుతున్నాను'' నవ్వాడు.

''మరి ఒకే నవల ఇన్ని కాపీలుందేం?'' ఆశ్చర్యంగా అన్నది.

''ఈ బుక్స్ నావే. అంటే నేను రాసినవే''

''ఈజిట్?''

''యస్... అయామ్ సూర్యమిత్ర''

శ్రావ్యకి ఆనందంతో ఓ క్షణం నోటమాట రాలేదు. అక్షరాలు కూడబలుక్కుంటూ అన్నది.

''... మీరు సూర్య... మిత్రా! ఈరోజు నిజంగా చాలా సుదినం... మిమ్మల్ని హఠాత్తుగా ఇలా కలుసుకోవడం... అందులోనూ మా ఇంట్లో... నాకు కలా... నిజమా అనిపిస్తోంది''

''నేను ఒక కొత్త నవల రాశాను. అది ఎడిటర్ గారికి ఇవ్వటానికి బయల్దేరాను. మధ్యలో ఈ వర్షం. నా స్కూటర్ షెడైపోయింది. షాప్‌లో వదిలేసి ఇలా బస్టాపులో పడిగాపులు పడుతున్నాను. నిన్ననే పూర్తిచేశాను నవల.. పూర్తి అయింది కదా అని ఇవ్వడానికి వెళ్లాను. నిన్న ఫోన్ చేశారు

ఆయనే కొత్త నవల కావాలని. అనుకోకుండా ఆయన ఫ్రెండ్ ఎవరో పోయారట, బైటికెళ్లారు ఆఫీసులో లేరు.'' సంచీలోంచి ఒక రిజిస్టర్ లాంటిది తీస్తూ అన్నాడు.

''అది మీ మానుస్క్రిప్టా?''

''అవునండీ...!''

''నేనోసారి చూడచ్చా...?''

''ఓ. ష్యూర్...'' ఆమెకందించాడు ఆ రిజిస్టర్.

శ్రావ్యకి తన అభిమాన రచయితతో మాట్లాడటం, అది కూడా తనింట్లో... అతని మానుస్క్రిప్టు చూడటం చాలా థ్రిల్లింగ్‌గా అనిపిస్తోంది. ఆనందంతో ఓసారి నాట్యం చేయాలనిపిస్తోంది. ఇదంతా కలకాదు కదా! అని కూడా అనుమానంగా ఉందామెకు.

''ఈ నవల నేను రాసే రొటీన్ నవలలకి భిన్నంగా ఉంటుంది. సంగీతంమీద బాగా డిస్కస్ చేశానిందులో. సంగీతాభిమాని ఐన ఓ అమ్మాయి తానభిమానించే ఓ సంగీత విద్యాంసుడిని అనుకోని పరిస్థితుల్లో ముఖా ముఖీ కలుసుకోవడం తటస్థిస్తుంది. అప్పటి దాకా రేడియోలోనూ, క్యాసెట్లలోనూ విన్న అతని సంగీత కచేరీ స్టేజీమీద సాగుతుండగా ప్రత్యక్షంగా ఆ ప్రోగ్రామ్ అటెండ్ అవడమే గాక అతన్ని కలుసుకుని తన అభిమానాన్ని వ్యక్తపరుస్తుంది. తానూహించినట్టు అతను ఏ నడివయస్కుడో కాకుండా అందమైన యువకుడు కావడం ఆమెకి ఎంతో ఆశ్చర్యాన్ని, సంతోషాన్ని కలిగిస్తుంది. క్రమంగా వారిద్దరి మధ్యా పరిచయం పెరిగి ప్రణయంగా మారుతుంది. అతనితో జీవితం పంచుకోవాలనుకుంటుంది. ఆమెకి తనపట్ల ఉన్న ఆరాధననీ, పిచ్చి ప్రేమనీ తనకు అనుకూలంగా వాడుకోటానికి ప్రయత్నిస్తాడు అతను. ఇందులో కూడా నేను ఆ అమ్మాయి ప్రేమను అమాయకమైన, స్వచ్ఛమైన ఆరాధనగా, అతని ప్రేమని వంచనగా చిత్రించాను''

శ్రావ్యకెందుకో అతనలా వివరంగా ఆ కథ చెప్పడం నచ్చలేదు. ఈ సందర్భంలో ఆ కథ ఎందుకు చెప్పాల్సి వచ్చింది... సాధారణంగా రైటర్స్ అలా చెప్పేయరే... ఓసారి కళ్లెత్తి అతన్ని చూసి అన్నది. ''ముగింపు ఏంచేశారు?''

''ముగింపు నేను చేయలేదు... మీకొదిలేశాను''

''అంటే...!'' అనుమానంగా చూసింది.

''అంటే... అదే... పాఠకులకు వదిలేశాను'' నవ్వేశాడతను.

శ్రావ్యకెందుకో అంతకుముందు తను చదివిన నవల్లో అతను రాసిన వాక్యం గుర్తొచ్చింది.

''అతను కాముకుడు... జూదరి... నీచుడు. కానీ సమాజంలో గౌరవనీయమైన పదవిలో ఉన్న అతను తన భావాలు మొహంలో ఏమాత్రం ప్రస్ఫుటం కాకుండా చాలా మామూలుగా ప్రవర్తిస్తాడు. అదే అతని ప్రత్యేకత...''

ఇతనలాంటివాడు కాదుకదా! శ్రావ్యకి తన ఆలోచనకి తనకే నవ్వొచ్చింది. అతని పుస్తకాలు చదివీ చదివీ మగవాళ్లని అనుమానించడం అలవాటైపోయింది. నవ్వుకుంది.

''మీ చిరునవ్వుల్లో విరిసి వాలిన పూలేనా ఇవి'' ఫ్లవర్‌వాజ్‌లో నవనవలాడుతోన్న గులాబీలను చూస్తూ అన్నాడు.

శ్రావ్య గుండె ఓక్షణం కొట్టుకుంది. మళ్లీ అదే భావన...

''ఈ పేజీలన్నీ చదవాలంటే కనీసం ఓసారి తిరగేయాలన్నా ఓ అరగంట పడుతుంది. అందుకే ఆలోచిస్తున్నాను. ఈ వర్షం ఇంకో అరగంట కంటిన్యూ అవుతుందంటారా?'' అన్నది అతని మాటకి సమాధానం చెప్పకుండా దాటేస్తూ.

''వర్షం కంటిన్యూ అవడం దేనికీ! ఈ పేజీలు తిరగేయడానికా? తన సమక్షం కోరా? అరగంటేం ఖర్మ... ఇంత అందమైన అమ్మాయి సమక్షంలో రాత్రంతా కురిసినా ఫర్వాలేదు'' అనుకున్నాడు.

మాట మారుస్తూ అడిగాడు. ''మీవారేం చేస్తుంటారు?''

''పబ్లిక్ సెక్టార్‌లో ఎగ్జిక్యూటివ్''

''ఈ ఫ్లాట్ స్వంతమా?''

''అవునండీ''

''ఇండివిడ్యువల్ ఫ్లాట్ బాగుంటుంది. కాస్త ఖాళీస్థలం ఉంటుంది. నాలుగు మొక్కలేసుకోవచ్చు.''

''నిజమే... కాని అలాంటి ఇల్లు కావాలంటే హార్ట్ ఆఫ్‌ది సిటీలో దొరకదు కదా! అవుట్ స్కర్ట్స్‌కెళ్లాలి. కూర్చోండి నేను మిమ్మల్ని కబుర్లతో

కూర్చోబెట్టేశాను. కాఫీ తీసుకొస్తాను'' శ్రావ్య లేచి రిజిస్టర్ టేబుల్ మీద పెట్టి కిచెన్‌లోకి వెళ్లింది ''వద్దండీ... మీకు శ్రమ'' అనే అతని మాటలు వినకుండా.

చక్కని అభిరుచులు, అందమైన రూపం, చలాకీతనం, సంస్కారం... ఇన్ని కలగలిసిన ఈ అందాల భరిణను పొందిన అతనెంత అదృష్టవంతుడో?

ఆమె తన అభిమాని కావడం తన అదృష్టం. ఆ భావన అతనికెంతో ఆనందాన్ని, గర్వాన్ని కలుగజేసింది.

ఐదు నిమిషాల్లో రెండు కాఫీ కప్పులతో వచ్చి చిరునవ్వుతో అందిస్తూ అన్నది. ''ఓ గొప్ప రచయిత మా ఇంటిని పావనం చేయటం... నా అదృష్టం. ఆయనకి ఓ కప్పు కాఫీ ఇవ్వడం శ్రమెలా అవుతుంది?''

ఆమె తనూ ఓ కప్పు తీసుకుని సోఫాలో కూర్చుంది. అంతలో గణగణా ఫోన్ మోగింది. కాఫీ కప్పు టేబుల్‌మీద పెట్టి వెళ్లి గోడకి ఫిక్స్ చేసిన స్టాండ్‌మీంచి రిసీవర్ అందుకుని ''హలో! శ్రావ్య హియర్'' అన్నది.

'శ్రావ్య...' ఎంత శ్రావ్యంగా ఉందో పేరు.

సూర్యమిత్ర ఆమె తీయని స్వరం ఆలకిస్తూ కాఫీ సిప్ చేయసాగాడు.

''ఏమిటీ పదకొండవుతుందా? అంతవరకూ నేనొక్కదాన్ని ఉండాలా? ఏం మీటింగ్ బాబూ... సరే... త్వరగా రండి... సరే... సరే అన్నానా?... ఏమిటి హడావుడి? ఓ...కే... ఓ.కే'

ఆమె రిసీవర్ క్రెడిల్ చేసి చిరునవ్వుతో విచ్చుకున్న మొహంతో నడిచి వస్తూ అన్నది.

''మావారి ఫోన్... ఆయనకేదో మీటింగ్ ఉందిట... లేట్ అవుతుందిట రావడానికి. ఎగ్జిక్యూటివ్‌ని పెళ్లిచేసుకున్నందుకు నాకిది శాస్తిలెండి. ఇంక దొరగారొచ్చిందాకా... మీ పుస్తకాలే గతి నాకు''

''లేట్‌గా వస్తానని ఫోన్ భర్త దగ్గర్నించి. ఆమె మొహంలో అతను లేట్‌గా వస్తానన్నందుకు అలక కానీ, కోపంగానీ లేదు. సంతోషంగానే ఉంది. ఈ విషయం తనతో ఎందుకు చెప్పినట్టు!'' సూర్యమిత్ర కవి హృదయం ఆమె మాటలకి పులకరిస్తోంది... పురుష హృదయం అర్థాలు వెతుకుతోంది...

కప్పు కిందపెడుతూ అన్నాడు. ''థాంక్యూ ఫర్ యువర్ కోల్డ్ కాఫీ''

ఆమె నొచ్చుకుంటూ అన్నది. ''సారీ... కాఫీ చల్లగా ఉందా? మరి

ముందే చెప్తే వేడికాఫీ ఇచ్చేదాన్నిగా''

''ఫర్వాలేదులెండి... ఇదీ రుచిగానే ఉంది''

''మీ ఫోటోలు నేనెప్పుడూ పత్రికల్లో చూడలేదు. కారణం?''

''నాకు పబ్లిసిటీ ఇష్టంలేదు. అయినా దేనికసలు ఫోటో వేయించుకోడం?''

''మాకోసం... అంటే మీ అభిమానుల కోసం. ఎప్పుడన్నా మీరెదురుపడితే ఫలానా అని మేము గుర్తుపట్టాలిగా!''

అతనికి మిగతా మాటలు విన్పించలేదు. ''మాకోసం...'' అన్న పదం 'నాకోసం'లా విన్పించింది. ఆమె కళ్లల్లోకి చూడాలనిపించింది భావాలకోసం... అందమైన ఆ కళ్లు, కవ్విస్తున్నట్లున్న నవ్వు... రెచ్చగొడుతున్న మాటలు... అతనికి నిజంగానే ఈ వాన తగ్గకపోతే బాగుండు అన్పించింది.

సాధారణంగా కొంచెం గాలీ, వానా మొదలవుతూనే సిటీలో కరెంట్ ఆఫ్ అయిపోతుంది. ఇవాళ కరెంట్ పోలేదెందుకో... ఒక వేళ కరెంట్ ఆఫ్ అయితే అగ్గిపెట్టె ఇచ్చే నెపంమీద ఓసారి ఆ చేయి తాకచ్చు... ఆ తరువాత... సూర్యమిత్రకి కరెంట్ పోతే బాగుండునన్న కోరిక సన్నగా మొదలై గాఢమైంది. ఆమెకి తనంటే ఇష్టం... తనకి కాఫీ ఇవ్వడం... తనతో మాట్లాడటం అదృష్టంగా భావిస్తోంది. తన అభిమాన రచయిత పొందు ఇష్టపడకుండా ఉంటుందా? ఇంకాసేపు ఇక్కడే కూర్చోవాలి. కానీ ఇంటి దగ్గర కళ్యాణి ఎదురు చూస్తుంటుంది. టైమ్ అప్పుడే ఏడున్నర... ఓసారి... ఫోన్ చేస్తే''

''ఇఫ్‌యూ డోంట్‌మైండ్, నేనోసారి ఫోన్ వాడుకోవచ్చా?'' అడిగాడు.

''ఓ... విత్ ప్లెజర్''

అతను లేచి ఫోన్ దగ్గరికి నడిచాడు. నంబర్ డయల్ చేశాడు... ''హలో కళ్యాణీ! నేను మాట్లాడుతున్నాను. నేను రావడానికి ఆలస్యం అవుతుంది. వర్షం ఇంకా తగ్గలేదు. నేను ఎడిటర్‌గారి రూమ్‌లోంచి మాట్లాడుతున్నాను. నవల గురించి డిస్కస్ చేస్తున్నాం. నాకోసం ఎదురు చూడకు... ఓ.కే...''

వింటున్న శ్రావ్య అయోమయంగా చూసిందతన్ని.

''ఎడిటర్ రూమ్‌లో ఉన్నాని చెప్పాడేం. వర్షం వచ్చింది... ఇలా ఆగిపోయాను... నా అభిమానితో మాట్లాడుతున్నానని చెప్పవచ్చుకదా! ఎందుకలా అబద్ధం చెప్పాడు? స్త్రీని గౌరవించాలి... భార్యాభర్తలిద్దరూ మంచి అవగాహనతో ఉండాలి... ఒకరిమధ్య ఒకరికి రహస్యాలుండకూడదు.

వంచన ఉండకూడదు... అని కథల్లో రాసే సూర్యమిత్రేనా ఇతను... ఇంత చిన్న విషయంలో అబద్ధం ఎందుకు చెప్పినట్టు!

తనొక ఆడపిల్లతో మాట్లాడుతూ, ఎడిటర్‌గారితో ఉన్నానని చెప్పాడేం!

శ్రావ్యకి నితిన్ ఫోన్‌కాల్ గుర్తొచ్చింది...

'సారీ శ్రావ్య... నేను మీటింగ్‌లో ఉన్నాను. రావడానికి లేట్ అవుతుంది. నాకోసం ఎదురు చూడకు...' దాదాపు వారానికోసారి ఇలాంటి కాల్ తనకి అందుతూనే ఉంటుంది... అంటే... అంటే నితిన్ కూడా ఇలాగే... శ్రావ్యకి భయంవేసింది. తను మోసపోతోందా? ఇంత పెద్ద రచయిత ఇంత చిన్న విషయానికి అబద్ధం చెప్పాడు. మామూలు మగవాడైన తన భర్త తనకి నిజం చెబుతున్నాడని గ్యారంటీ ఏమిటి?''

''ఇవాళ విచిత్రం... ఇంత గాలీ, వానా వస్తున్నా కరెంట్ ఆఫ్ అవకపోవడం కదూ!'' ఉలిక్కిపడింది శ్రావ్య అతని మాటలకి.

ఇతనిక్కడే ఇంకాస్సేపు ఉంటే ఏం జరుగుతుందో అనిపించింది. మాట్లాడకుండా నవ్వి ఊరుకుంది.

''మీ నవ్వు చాలా బాగుంటుంది''

శ్రావ్యకి చిరాకేసింది. చిరాకు కన్పించకుండా, ''థాంక్యూ'' అన్నది.

ఎంత ధైర్యం ఇతనికి? చూట్టానికి ఎంత నెమ్మదస్తునిలా, బుద్ధిగా ఉన్నాడు... రచయిత కదా అని కొంచెం ప్రత్యేకత చూపించినందుకు ఎంత అడ్వాంటేజ్‌గా తీసుకుంటున్నాడు...? రచయిత అంటే ఓ గొప్ప వ్యక్తిగా ఇన్నాళ్ళూ తన మనసులో అతనికి ఓ ప్రత్యేక స్థానాన్నిచ్చినందుకు సిగ్గేసింది శ్రావ్యకి. అతని రాతలకీ, మాటలకీ, చేతలకీ ఏమాత్రం పొంతన లేదు. రాసేవన్నీ ఆచరించాలన్న నియమం ఏమీ లేదేమో! రాయడం హాబీ కావచ్చు. అతని హాబీ అతనికి ఎంతోమంది అభిమానులను అందించవచ్చు. అతనిలోని మరో వ్యక్తిని అసలైన అతి సాధారణ వ్యక్తిని చూశాక ఎంతమంది అభిమానులు మిగిలి వుంటారితనకి!

ఐదు నిమిషాలు నిశ్శబ్దం తరువాత అతనడిగాడు.

''మీవారు లేట్‌గా వస్తారన్నారుగా అప్పటి దాకా ఏం చేస్తారు?''

శ్రావ్య సోఫాలోంచి లేచింది... కిటికీ దగ్గరకు వెళుతూ అన్నది, ''ఆయన గురించి ఆలోచిస్తూ వుంటాను... నిజంగా ఆయన మీటింగ్‌లో ఉన్నారా?

లేక ఎవరన్నా ఫ్రెండ్‌తో ఏదన్నా పార్టీలో ఉన్నారా! అని''

కిటికీ రెక్క తెరిచింది.

చల్లగాలి మొహాన్ని తాకింది. వాన వెలిసింది. తుంపర్లు పడుతున్నాయి.

''వాన వెలిసింది'' అన్నది.

''అరే... వెలిసిందా...! హమ్మయ్య'' అతను లేచాడు. పుస్తకాలన్నీ సంచీలో పెట్టుకున్నాడు. తన చేతిలో ఉన్న నవల ఆమెకిస్తూ అన్నాడు. ''అనుకోకుండా కలిగిన మీ పరిచయం... మీ ఆతిథ్యం, మీ మాటలు నేనెప్పుడూ మర్చిపోను. నా గుర్తుగా మీకిది ప్రెజెంట్ చేస్తున్నాను''

శ్రావ్యకి నిరాకరించాలనిపించింది. అతను వెళ్ళిపోతాడు... ఇంకెప్పుడూ జీవితంలో అతన్ని కలుసుకోవపోవడం, అతని రచనలను బహిష్కరించటం... ఇదే అతనికి శిక్ష. ఆ శిక్ష తెలిస్తే అతనేం చేస్తాడు... ఏమీ చేయడు. మరో అభిమానిని వెతుక్కుంటాడు. అందుకే నిశ్శబ్దంగా అందుకుని ''థాంక్స్'' అన్నది.

అతను కళ్లజోడు తీసి టవల్‌తో తుడిచాడు.

''మీరేమీ అనుకోకపోతే ఓమాట అడగొచ్చా'' శ్రావ్య అడిగింది.

''అడగండి''

''మీరు మీ భార్యకి ఫోన్‌లో అబద్ధం ఎందుకు చెప్పారు? మీ అభిమాని అయిన ఓ అమ్మాయితో మాట్లాడుతున్నానని నిజం చెప్పచ్చుకదా! స్త్రీ పురుషులు స్నేహంగా మాట్లాడుకోవటం తప్పవుతుందని మీరు భావిస్తున్నారా?''

అతను నవ్వాడు. కళ్లజోడు కళ్లకి పెట్టుకుని అన్నాడు. ''నా దృష్టిలో ఎంతమాత్రం తప్పుకాదు. కానీ నాభార్యకి అన్ని విషయాలూ చెప్పడం అంత అవసరంగా నేను భావించడం లేదు. మగవాడిని నేను ఎన్ని పనులమీదో తిరుగుతుంటాను. మాకు ఎన్నో పరిచయాలుంటాయి. అవసరాలుంటాయి... అవన్నీ ఇంట్లో చెబితే అర్థం చేసుకోరు. అనవసరంగా గొడవలు... తలనొప్పి... అందుకే కొన్ని విషయాలింట్లో చెప్పను... ఓ.కే... గుడ్‌నైట్... మిమ్మల్ని నేను మళ్లీ కలుసుకుంటాను... వస్తాను'' అతను చెప్పులేసుకున్నాడు. అతను వెళ్తోన్న వైపు అలాగే చూస్తున్న శ్రావ్య గాఢంగా నిట్టూర్చింది.

మహా రచయితగా కీర్తింపబడుతూ, ఎంతోమంది అమ్మాయిల హృదయాల్లో ఉన్నతస్థానాన్ని అధిరోహించి, ఆదర్శ రచయితగా, స్త్రీల అభ్యుదయాన్ని ఆశించే వ్యక్తిగా ఆరాధనలు అందుకుంటోన్న ఈ వ్యక్తి తన నుంచి తన భార్యని సెపరేట్ చేస్తూ. 'మగవాడికెన్నో పనులుంటాయి... అవన్నీ ఆడవాళ్లకి చెప్పడం అనవసరం' అనే స్త్రీ పురుష వ్యత్యాసాన్ని విశదీకరిస్తున్నాడు.

అతను వ్యక్తిగా తను నిలుపుకున్న స్థానాన్నుంచి ఒక్కో మెట్టే జారుతూ... దిగజారుతూ కన్పించాడు.

ఎంత గొప్ప రచయిత! కానీ మగవాడు... మగవాడిగా తన సంకుచిత స్వభావాన్ని, చాటుకున్నాడు. అభిమానులను సంపాదించుకోడానికి స్త్రీ జనోద్ధరణవాదిగా కథలు రాసినంత మాత్రాన అతను గొప్పవాడు కాదుకదా!

శ్రావ్య మనసు భారంగా, విషాదంగా అయిపోయింది. తన చేతిలో అతను బహూకరించిన పుస్తకం... టేబుల్‌మీద ఉన్న 'కాంతి కిరణం' రెండూ తీసి ఓసారి వాటిని చూసింది. విసురుగా అటకమీదికి విసిరేసింది.

ఇప్పుడు ఆమెకి చాలా తృప్తిగా అనిపించింది.

విపులలో ప్రచురితం